క్లుప్తంగా

14న సర్వసభ్య సమావేశం

విజయపురం: మండల కేంద్రం మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 14వ తేదీ సాధారణ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ రాజేంద్ర సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత ఏడాది జరిగిన పనులపై చర్చిస్తామన్నారు. అలాగే నూతనంగా జరిగే పనులపై తీర్మానం చేస్తామని ఆయన తెలిపారు. మండల స్థాయి ఎంపీటీసీ, సర్పంచ్‌లతోపాటు అన్ని శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని, విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యార్థులకు అన్నదానం



విద్యార్థులకు అన్నదానం చేస్తున్న దాతలు

కార్వేటినగరం: పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం పెట్టడం ఒక వరమని డీఎంపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం నాదమునిరెడ్డి తెలిపారు. పాఠశాలలో పనిచేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయురాలు సరస్వతి, పూర్వవిద్యార్థి శేషరాజు సోమవారం మధ్యాహ్నం శుభదిన్ పేరిట 138 మంది విద్యార్థులకు అన్నదానం చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ ఈ పాఠశాలలో విద్యనభ్యసించి సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న శేషరాజు గత ఏడాది నుంచి శుభదిన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రతి రోజూ స్నాక్స్, పండ్లు అందజేస్తున్నారని తెలిపారు. తమ కుటుంబాల్లో జరిగే శుభకార్యాల్లో భాగంగా విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాలతి, కలైవాణి, సుమతి, పీఈటీ కిషోర్‌కుమార్, బొజ్జారాము, హరి, ఢిల్లీబాబు, రాములు, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై చర్యలు తీసుకోవాలి

పాలసముద్రం: మండలంలోని కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొందని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ అన్నలగన్ తెలిపారు. ఆయన సోమవారం ఎంపీడీవో విద్యావతిని కలిసి సమస్యలను వివరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా వుందని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శంకర్, గోపాల్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కోటకొండ బాబు

పుత్తూరు: నూతన రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నేతృత్వంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బీజేపీ బలోపేతం అవుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కోటకొండ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర పార్టీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మాధవ్ తొలిసారిగా సోమవారం చిత్తూరు జిల్లా పర్యటనకు వచ్చారు. చిత్తూరులో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనేందుకు పుత్తూరు నుంచి పలువురు పార్టీ నాయకులు స్థానిక ఈశ్వరాలయం నుంచి ప్రత్యేక బస్సుల్లో బయల్దేరి వెళ్లారు. కార్యక్రమంలో నగరి అసెంబ్లీ పార్టీ కన్వీనర్ హరిబాబు, పుత్తూరు, వడమాలపేట మండలాల అధ్యక్షులు గిరిప్రసాద్, సుబ్బులు, సీనియర్ నాయకులు చెన్నకేశవులు, సరస్వతమ్మ, హేమలత, మహేంద్రబాబు, వెంకట్రాయులు, సుబ్రమణ్యంరాజు పాల్గొన్నారు.

భూ రీసర్వే పూర్తిచేయండి

యాదమరి: మండలంలో మూడవ దశ భూముల రీసర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని తహసీల్దార్ పార్థసారథి ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన సర్వేయర్లు, వీఆర్‌ఓలతో సమావేశమై మాట్లాడారు. రీసర్వేలో భాగంగా మూడవ దశలో యాదమరి, మాదిరెడ్డిపల్లె, కుక్కలపల్లె, దాసరాపల్లెలో ఈ నెల 20వ తేదీ లోపు పూర్తిచేయాలన్నారు. ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా భూయజమానుల సమక్షంలో సర్వే చేయాలన్నారు. అర్జీదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తన దృష్టికి, అలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదలా ఉంచితే, సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 15 ఫిర్యాదులు అందాయని, ఎక్కువగా భూసమస్యలు, రీసర్వేలపై సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరారని తహసీల్దార్ చెప్పారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

తవణంపల్లె: రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, స్థానిక తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో సోమవారం తహసీల్దార్ సుధాకర్‌ను ఆయన కార్యాలయంలో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, సిబ్బంది సత్కరించి అభినందించారు. రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని, అలాగే వచ్చే నెల రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

నాడు శిథిలం.. నేడు శిరోధార్యం

- నింద్ర ప్రసన్న వెంకటేశ్వరాలయానికి ఆధ్యాత్మిక వైభవం
- కొన్ని దశాబ్దాలుగా పట్టించుకోని పాలకులు
- గత పాలనలో మాజీ మంత్రి చొరవతో నూతన ఆలయం
- ఆలయానికి ఉభయదేవేరులతో వేంచేసిన వెంకటేశ్వరుడు
- విగ్రహాలు వచ్చి ఏడు నెలలు అవుతున్నా జరగని కుంభాభిషేకం



నిర్మాణం పూర్తి చేసుకున్న ప్రసన్న వెంకటేశ్వర ఆలయం



శిథిలావస్థలోని స్వామివారి ఆలయం (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్: కొన్ని దశాబ్దాల తరబడి శిథిలావస్థలో ఉన్న నింద్ర ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి ఆలయం నేడు కళకళలాడుతోంది. నాడు ఎవ్వరూ పట్టించుకోక శిథిలమైన ఆలయం నేడు గ్రామస్తులకు శిరోధార్యమైంది. ఇదంతా గత పాలనలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మాజీ మంత్రి ఆర్కే రోజా టీటీడీ ద్వారా రూ.1.80 కోట్లు మంజూరు చేయించడంతోనే సాధ్యమైంది. వివరాల్లోకి వెళితే కొన్ని వందల సంవత్సరాల క్రితం శ్రీకృష్ణదేవరాయల పాలనలో నింద్ర మండలంలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో నిత్యపూజలు నిరిర్విరామంగా జరిగేవి. కాలక్రమేణా ఆలయం శిథిలావస్థకు చేరడంతో భక్తులు ఆలయానికి దూరమయ్యారు. గతంలో ఆలయంలో ఒకవైపు జరిగిన తవ్వకాల్లో 5 పంచలోహ విగ్రహాలు బయటపడగా వాటిని అధికారులు ట్రెజరీకి తరలించారు. ఒక పెద్ద రాతి విగ్రహం బయటపడగా పురావస్తు శాఖవారు చెన్నై పురావస్తు మ్యూజియంకు తరలించారు. విశిష్టతకు నిలయమైన ఆలయం లేక పిచ్చిమొక్కలు, చెత్తకుప్పల చాటున పాడుబడిపోయింది. గత పాలకులు ఎవ్వరూ ఆలయ పునర్నిర్మాణం గురించి పట్టించుకోలేదు. కనీసం ఆ దారిలో వెళ్లినపుడు ఆలయ విశిష్టతను తెలుసుకోవడానికి కూడా ఆసక్తి చూపలేదు. ఆలయ నిర్మాణ పనులు చేపట్టడానికి దాతలు కూడా ముందుకు రాలేదు. అయితే గత పాలనలో టీటీడీ ద్వారా నియోజకవర్గంలో పలు ఆలయాలను నిర్మించిన మాజీ మంత్రి ఆర్కే రోజా నింద్ర మండలంలో శిథిలమైన ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. ఆలయ పునర్నిర్మాణానికి నడుంబిగించారు. విశిష్టతకు తగిన రీతిలో ఆలయ నిర్మాణం జరగాలని ప్రత్యేక చొరవ తీసుకొని రూ.1.80 కోట్లు మంజూరు చేయించారు. శిథిలమైన ఆలయాన్ని తొలగించి 2023, ఆగస్టు నెలలో నూతన ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేయగా పనులు వేగంగా సాగాయి. ఫలితం నేడు కళకళలాడే ఆలయం గ్రామస్తులకు కనువిందు చేస్తోంది. శ్రీదేవి, భూదేవి సమేతంగా ప్రసన్న వెంకటేశ్వర స్వామి విగ్రహం కూడా ఆలయానికి చేరుకుంది.

అధికారం మార్పుతో కుంభాభిషేకం వాయిదా

టీటీడీ ద్వారా నిర్మించిన ఆలయాలన్నీ కుంభాభిషేకం చేసుకోగా నింద్ర ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ కుంభాభిషేకం మాత్రం వాయిదా పడింది. ఏడు నెలలుగా విగ్రహాలు పూజలకు నోచుకోవడం లేదు. రాజగోపురం, ప్రహరీ గోడ నిర్మించిన అనంతరం కుంభాభిషేకం చేసుకుంటామని, వాటి నిర్మాణానికి విరాళాలు సేకరిస్తున్నామని టీటీడీకి సంబంధం లేని ప్రైవేటు వ్యక్తులు ముందుకు వచ్చారు. దీంతో భూదేవి, శ్రీదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరుడు తమను ఎప్పుడు కటాక్షిస్తాడో అని ఎదురుచూడడమే ప్రజల వంతుగా మారింది. ఈ దశలో విరాళాల సేకరణతో నిర్మించే ఆలయ గోపుర నిర్మాణానికి భూమిపూజ కూడా ఎమ్మెల్యే ద్వారా స్థానికులు చేయించారు. ఈ వేడుకలకు స్థానికంగా ఉన్న టీడీపీ నేతలే ఎక్కువగా హాజరవడం, స్థానికులు పెద్దగా కలవక పోవడం గమనార్హం. టీటీడీ ద్వారా చేపట్టే ఆలయ నిర్మాణ పనులు విరాళాల సేకరణ రూపంలో రాజకీయ రంగు పులుముకుంటోందని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఏదేమైనా శిథిలావస్థలోని ఆలయం నేడు ఈ స్థాయికి చేరిందంటే అది ఆలయ నిర్మాణానికి మాజీ మంత్రి చూపిన చొరవే అనడంలో అతిశయోక్తి లేదు. అందుకే టీడీపీ నేతలు ఆలయ వ్యవహారంలో రాజకీయాలు చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.





2023లో ఆలయ నిర్మాణానికి కొలతలు వేస్తున్న టీటీడీ అధికారులు, ఆలయ నిర్మాణానికి భూమిపూజ వేస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా దంపతులు (ఫైల్)

ఆర్గానిక్ కూరగాయలకు గిరాకీ



అమ్మకానికి సిద్ధంగా ఆర్గానిక్ కూరగాయలు

నగరి: ఆర్గానిక్ కూరగాయలకు గిరాకీ పెరిగింది. ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో విక్రయించే ఆర్గానిక్ కాయగూరల కొనుగోలుకు జనం ఆసక్తి కనబరుస్తున్నారు. రసాయనాలతో పండించే పంటలు ప్రజలను ఎలా బాధిస్తున్నాయనే అంశానికి ఈ ఆర్గానిక్ అమ్మకాలు అద్దం పట్టాయి. దిగుబడులు తక్కువ వచ్చినా ఆరోగ్యకరమైన ఆహారం అందించేందుకు సిద్ధమైన రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగు చేస్తూ వాటిని ఇలా విక్రయిస్తున్నారు.

బార్లుగా బస్ షెల్టర్లు



బైపాస్ సర్కిల్ వద్ద అపరిశుభ్రంగా ఉన్న బస్ షెల్టర్

నగరి: ఎండకు, వానకు తలదాచుకోవడానికి ప్రయాణికుల కోసం నిర్మించిన బస్ షెల్టర్లు రాత్రిపూట మందుబాబులకు బార్‌లుగా మారుతున్నాయి. రాత్రి పూట వారు పడేసి వెళ్లే మద్యం బాటిళ్లు, గ్లాసులు, తిని పడేసే ఆహార పదార్థాలు బస్ షెల్టర్‌ను అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. బస్ షెల్టర్ ఆవరణ కూడా అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఎండలకు, వానలకు కూడా షెల్టర్‌లోకి వెళ్లడానికి సంశయిస్తున్నారు. అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కొనసాగుతున్న అధ్యాపకుల నిరసన



నల్ల బ్యాడ్జీలతో అధ్యాపకుల నిరసన

పుత్తూరు: దీర్ఘ కాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు చేస్తున్న నిరసన ఐదో రోజుకు చేరింది. సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. తిరుపతి జిల్లా జీసీజీటీఏ అధ్యక్షుడు టి.నరసింహులు మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు భోజన విరామ సమయంలో శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న బదిలీలు, పదోన్నతులపై న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు సుజన, జిల్లా కార్యదర్శి వెంకటకృష్ణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం

శ్రీరంగరాజపురం: ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలని తహసీల్దార్ లోకనాథరెడ్డి ఆదేశించారు. ఆయన సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్‌డేలో 14 వినతులు వచ్చినట్లు తెలిపారు. భూసర్వేకు 2, ఇళ్ల నిర్మాణానికి పొజిషన్ పట్టా కోసం 2, పట్టాదారు పాసుపుస్తకం కోసం 2, భూమి ఆక్రమణపై 2, బర్త్ సర్టిఫికెట్ల కోసం 3, డెత్ సర్టిఫికెట్ల కోసం 2, రేషన్ కార్డు కోసం ఒకటి ఉన్నట్లు తెలిపారు.

ముగిసిన కుంభాభిషేకం



శ్రీ వరసిద్ధి వినాయక స్వామి



నాగదేవత



సుబ్రమణ్య స్వామి



వీరాంజనేయ స్వామి

వెదురుకుప్పం: మండలంలోని సీఆర్‌కండ్రిగలో నిర్మించిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కుంభాభిషేకం సోమవారం ముగిసింది. ఇందులో భాగంగా తెల్లవారుజామున 4 గంటలకు వేదపండితులు వేదపారాయణం చేశారు. ప్రతిష్టాంగ హోమం, మహా పూర్ణాహుతి చేశారు. 5–6 గంటల మధ్య వరసిద్ధి వినాయకుడు, సుబ్రమణ్య స్వామి, నాగదేవత, వీరాంజనేయ స్వామి విగ్రహాల ప్రాణ ప్రతిష్టను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్త రామయ్య, విజయకుమారి దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి ద్రౌపదీ మానసంరక్షణ వీధి నాటక ప్రదర్శన నిర్వహించారు.

నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్లు ప్రవీణ్, మౌనిక



వెదురుకుప్పంలో పోస్టర్ల ఆవిష్కరణ

గంగాధరనెల్లూరు: నులిపురుగుల నివారణతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్లు ప్రవీణ్, మౌనిక తెలిపారు. తూగుండ్రం పీహెచ్‌సీలో సోమవారం వైద్య సిబ్బందికి ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. వారు మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 48 అంగన్‌వాడీ కేంద్రాలు, 51 ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలోని విద్యార్థులకు మంగళవారం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు.

ఆల్బెండజోల్‌తో నులి పురుగుల నివారణ

వెదురుకుప్పం: ఆల్బెండజోల్‌తో నులిపురుగులను నివారించవచ్చని ఎంపీడీవో పురుషోత్తం తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వెదురుకుప్పంలో కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. కార్యక్రమంలో పచ్చికాపల్లం పీహెచ్‌సీ వైద్యాధికారి కృష్ణచైతన్య, ఎంఈఓ దామోదరం, సీహెచ్‌వో మధుసూదన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల, ఆరోగ్య పర్యవేక్షకులు మోహన్‌మురళీ, ఈశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీలు హిమగిరి, రజని పాల్గొన్నారు.

పర్యావరణానికి జీవ ఇంధనం అవసరం



పోస్టర్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పుత్తూరు: జీవ ఇంధనాల వినియోగం పర్యావరణ పరిరక్షణకు ఎంతో అవసరమని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి తెలిపారు. సోమవారం కళాశాలలో ప్రపంచ జీవ ఇంధన దినోత్సవాన్ని కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు, పంటల అవశేషాలు, జంతు వ్యర్థాల వంటి సహజ వనరుల నుంచి ఉత్పత్తి చేసే ఇంధనమే జీవ ఇంధనమని తెలిపారు. జీవ ఇంధనం వాడకంతో బొగ్గు, పెట్రోల్, డీజిల్ మొదలైన రసాయనాల వాడకం గణనీయంగా తగ్గుతుందన్నారు. తద్వారా గాలి కాలుష్యం సైతం తగ్గడంతో పర్యావరణం పరిశుభ్రమవుతుందని వివరించారు. జీవ ఇంధనంపై విద్యార్థులు పోస్టర్ ప్రదర్శించారు. కెమిస్ట్రీ విభాగం అధ్యక్షుడు డాక్టర్ పి.హరిబాబు, అధ్యాపకులు మన్యం నరసింహులు, శంకర్రావు, విష్ణుప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో నులిమేద్దాం

- నేడు నులి పురుగుల నివారణ దినోత్సవం
- మాత్రల పంపిణీకి సర్వం సిద్ధం చేసిన అధికారులు
- 19 ఏళ్లలోపు వారు తప్పనిసరిగా మాత్రలు వేసుకోవాలి





పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ మోహన్‌క్రిష్ణ (ఇన్‌సెట్) పంపిణీకి సిద్ధంగా ఉన్న అల్బెండజోల్ మాత్రలు

పాలసముద్రం: నులిపురుగులు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. కడుపులో నులిపురుగులు ఉండడంతో పిల్లల్లో ఎదుగుదల తక్కువగా ఉంటుంది. బలహీనంగా ఉంటారు. శరీరం నీరసంగా ఉంటుంది. ఈ క్రమంలో నులి పురుగులను నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి చర్యలు తీసుకుంది. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 24,340 మంది పిల్లలకు మాత్రలు అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

అపరిశుభ్రతే కారణం

పిల్లల్లో నులి పురుగులు పెరగడానికి అపరిశుభ్రతే కారణం. పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించని పిల్లల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంటుంది. ముఖ్యంగా పిల్లలు చేతిగోళ్లను శుభ్రంగా ఉంచుకోవాలి. గోళ్లు పెరిగినప్పుడు వెంటనే కత్తిరించుకోవాలి. లేకుంటే వాటిల్లో పేరుకున్న మట్టి ద్వారా నులి పురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. కలుషిత నీరు తాగడం, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయడంతో కూడా నులిపురుగులు మన శరీరంలోకి చేరతాయి. కూరగాయలను కడగకపోవడం, భోజనం చేసే ముందు చేతులు కడుక్కోకపోవడం, ఆహార పదార్థాలపై మూతలు లేకపోవడంతో కూడా నులిపురుగుల ప్రభావం ఉంటుంది.

రక్షణ కోసం ఇలా

బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేయకూడదు. మల విసర్జన తర్వాత, భోజనానికి ముందు తప్పనిసరిగా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి. కాళ్లకు చెప్పులు లేదా బూట్లు ధరించాలి. పెరిగిన గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. పరిశుభ్రమైన నీటిని తాగాలి. పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగిన తర్వాతే తినాలి.

నులిపురుగులతో అనర్థాలు

నులిపురుగులు చిన్నారుల్లో రక్తహీనతకు దారితీస్తాయి. శారీరక, మానసిక ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తాయి. కడుపులో చేరి నొప్పి, మంట, వికారం కలుగజేస్తాయి. దీనివల్ల ఆహారం సహించదు. ఆకలి ఉండదు. పిల్లలు నీరసపడతారు. శారీరక, మానసిక ఎదుగుదల లోపిస్తుంది. వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. వాంతులు, మలంలో రక్తం, అతిసారం వంటి సమస్యలు వస్తాయి. ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లల్లో నులిపురుగుల సమస్య ఎక్కువగా ఉంటుంది.

పిల్లల్లోనే ఎక్కువ



పిల్లల్లో మూడు రకాల పురుగులు ఉండే అవకాశం ఉంది. అవి ఏలికపాములు, నులిపురుగులు, కొంకిపురుగులు. వీటిని నిర్మూలించేందుకు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలి. మాత్రను భోజనం తర్వాత మింగాలి. మాత్ర వేసుకున్న ఒక రోజు లేదా రెండు రోజుల్లో మలం ద్వారా నులి పురుగులు బయటికి వెళ్లిపోతాయి.

– వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ పాలసముద్రం

వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మాత్రలు మింగించాలి



ఏడాది నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రను సగం 200 మిల్లీలీటర్ల నీటిలో కలిపి తాగించాలి. 2 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు 400 మిల్లీగ్రాముల మాత్రను మధ్యాహ్నం భోజనం తర్వాత చప్పరించేలా చూడాలి. పాఠశాలల్లో బోధనా సిబ్బంది, వైద్య సిబ్బంది పర్యవేక్షణలోనే మాత్రలు వేయాలి.

– పద్మసునంద, సీడీపీఓ, గంగాధరనెల్లూరు ప్రాజెక్టు

24,340 మందికి మాత్రల పంపిణీ



గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఒకటి నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు 24,340 మంది ఉన్నారు. వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేశాం. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మాత్రలు మింగిస్తాం. మిగిలిపోయిన వారికి స్పెషల్ డ్రైవ్ పెట్టి మాత్రలు మింగేలా చూస్తాం.

– సి.హనుమంతరావు, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్

యూరియా కోసం రైతుల ఆందోళన



ఎరువుల కోసం ఆందోళన చేస్తున్న రైతులు

బంగారుపాళెం: స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద సోమవారం యూరియా కోసం రైతులు ఆందోళన చేశారు. పలువురు రైతులు యూరియా కోసం మండల కేంద్రం బంగారుపాళెం లోని వ్యవసాయ కార్యాయం వద్దకు వచ్చారు. వ్యవసాయాధికారులు 10.30 గంటలకు కార్యాలయం వద్దకు వచ్చారు. యూరియా స్టాకు లేదని చెప్పడంతో ఆగ్రహించిన రైతులు కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ, మండల కేంద్రానికి వచ్చిన యూరియా ఏమైందని అధికారులను ప్రశ్నించారు. ఎరువుల కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ దుకాణాలలో ఎక్కువ ధరకు యూరియా విక్రయిస్తున్నారని, ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలకు సక్రమంగా ఎరువులు సరఫరా చేయడం లేదని మండిపడ్డారు. ఈ పరిస్థితుల్లో వ్యయ ప్రయాసకోర్చి ఇతర ప్రాంతాల నుంచి ఎరువులు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. గత ప్రభుత్వ పాలనలో రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేవని, అధికారులు స్పందించి రైతులకు యూరియా పంపిణీ చేయాలని కోరారు.